# దళిత ధర్మం

అది హస్తినాపురం.

ఆరోజు దానికి నిద్రలేదు.

పగలు జరిగిన ఘటనలు సాధారణమయినవి కావు. ఒకే వంశంలో ఒకరు మరొకరి మీద యుద్ధాలు చేసుకోవటం... అరుదుగానయినా- జరుగుతూంటుంది. ఒకరి స్త్రీలను మరొకరు తమ వంశగౌరవంగా, కుల చిహ్నంగా గుర్తించుతారు. ఆరోజు- పాత సంప్రదాయాలన్నింటికీ గండిపడింది. అన్నదమ్ముల బిడ్డలయిన కౌరవ పాండవుల మధ్య మాత్సర్యాలు ఎంత సహజమో- వారి స్త్రీలను అగౌరవపరచటమనేది అంత అసహజం. అది నగరంలోని పెద్దలకే గాదు - పిన్నలకు కూడా ఊహాతీతమయిన సంఘటన.

అందుకే-

విననివాళ్ళకి విన్నవాళ్ళు వినిపిస్తున్నారు.

కనని వాళ్ళకి కన్నవాళ్ళు కళ్ళకి కట్టిస్తున్నారు.

అందులో ధర్మాధర్మాల గూర్చి అందరూ ఆలోచిస్తున్నారు.

ఆలోచనలు మాటలవుతున్నాయి.

మాటలు కొత్త ఆలోచనలకి పట్టని మూటలవుతున్నాయి.

"రాచవారు కదా పాండవులు. వారిని కౌరవులు దాసులుగా చేసుకోవచ్చా?"

"ఓడినవారంతా దాసులవటం ఎన్ని యుగాల నుంచి జరుగుతోంది? ఇది కొత్త ధర్మమేం కాదు."

"క్షత్రియులు యుద్ధంలో ఓడటం ఓడించటమూ ధర్మం - ద్యూతంలో ఓడటమూ అదీ ఒక ధర్మమా?"

"ధర్మం కాకపోతే- ధర్మరాజుల వారు ఎందుకు ఒడంబడతారు?"

"ఏం ఒడంబడ్డారు? తమ్ముడు రెచ్చిపోయి రక్తం తాగుతాననీ, తొడలు విరగగొడతాననీ ప్రతిజ్ఞలు చేసాడట. వారించారా? లేదే! మౌనానికి అర్థం ఏమిటి?"

"ఆయన ధర్మస్వరూపుడు. అందుకేగదా- దాసులమని అంగీకరిస్తూ పై బట్టలను తొలగించారు. ఆయన తమ్ములు కూడా ముందు ఎలా మాట్లాడినా- అన్నగారి ఆజ్ఞలకు లోబడి దాసులయారు. అదీ ధర్మం పట్ల వారి నిబద్ధత."

"కౌరవులు మాత్రం ధర్మం పాటించలేదా? స్త్రీ భర్త సొత్తు గదా- భర్తే దాసుడయినపుడు అతని భార్య కూడా దాసేగదా-! అయినప్పటికీ- ధర్మరాజుల వారికి మరో అవకాశం యిచ్చారు ధుర్యోధన ప్రభువు. ద్రౌపదిని మరోసారి పందెం ఒడ్డటానికి అంగీకరించారు. అందులో కూడా ఆవిడ పోగొట్టుకున్నాకనే గదా - ద్రౌపదీ దేవిని దాసిగా పరిగణించారు. అప్పుడేకదా - ఆమెను పరిచర్యల కోసం పిలిచారు. ఆమె రాకపోతేనేగదా బలప్రయోగానికి దిగారు. భర్తలు పైబట్ట తొలగించినపుడు - భార్య అంగీకరించవద్దా? తొలగించవద్దా? అదేనా పాండవుల ధర్మపాలన?"

"ప్రభువులకీ - సామాన్యులకీ ఒకే ధర్మమా?"

"కాక- దాసీ ధర్మం - ఎవరికయినా ఒకటేగదా!"

"అందుకు ద్రౌపదీ అమ్మవారు అంగీకరించకపోలేదుగదా - వారి సంశయాన్ని తీర్చమని సభను అర్థించారు - నన్నోడి తన్నోడెనా - తన్నోడి నన్నోడెనా - అని అడిగారు. ఇలా ధర్మ సంశయాన్ని పెట్టి తనను తాను రక్షించుకోజూడటం ధర్మమే!"

"ఓడటం ఎలా ఓడినా- దాసీల్లా పై బట్ట తీసేయటమే ధర్మం-"

"అది ధర్మమే అయితే - దుశ్శాసనుల వారు అంత ప్రయత్నించినా ఎందుకు నెగ్గలేకపోయారు?-"

"....."

"ఎందుకంటే, అది అధర్మం కనక- పాండవులకు అది అధర్మం అని తెలుసుగనకనే- తాము యింతకాలం రక్షించిన, పాలించిన ధర్మం తమని రక్షించుతుందని నమ్మారు- భగవత్స్వరూపుడయిన జనార్దనుడే అది అధర్మమని భావించారు. అందుకే కృష్ణను దాసీ కాకుండా కాపాడారు-"

"ఎక్కడో ఉన్న శ్రీకృష్ణులవారు కాపాడారా! నేను నమ్మను. అంతగా ఆయన తలుచుకుంటే ద్రౌపదీదేవి వారి మీద చేయివేసిన దుశ్శాసనుల వారిని అక్కడికక్కడ దహించి వేయొచ్చుగదా- ఎందుకా పని చేయలేదు? వస్త్రాన్ని అనంతంగా యివ్వటమేమిటి?"

"అయితే- నువ్వనేదేమిటి?"

"ద్రౌపదీ అమ్మవారి దాసీలే ఆమెకు వస్త్రాలు యిస్తూ వచ్చారుట. ఒకవైపు వస్త్రాపహరణం జరుగుతూ వుంటే - మరోవయిపు వస్త్రాలు నేస్తూ యిచ్చారుట-"

"నువ్వు చూసావు-"

"నువ్వు మాత్రం చూసావు-"

"....."

"అందుకే- దాసీలూ, ఆ మీదట దాసులూ తిరగబతారేమోనని దుర్యోధనులవారు భయపడి తమ ప్రయత్నాన్ని విరమించుకున్నారుట"

"సభలో అందరు వృద్ధులూ, జ్ఞానులూ ఊరుకుంటే దాసదాసీలు పూనుకున్నారంటావు. వారి పైబట్టలనే వారు వేసుకోలేని వారు యింకొకరి పైబట్టలను కాపాడారంటావు - నీ కల్పనను ఎవరూ నమ్మరు. అంగీకరించరు-"

"....."

"ఎవరెన్ని చెప్పినా అధర్మం ఎప్పటికీ గెలవదు - ఆ విషయం తెలిసే - దుశ్శాసనుల వారు అలసిపోయి సిగ్గుపడి తమ ప్రయత్నం విరమించుకున్నాక - దుర్యోధన ప్రభువులు మరెవరినీ ఆ పనికి నియోగించలేదు. వారు చేసిందీ ఒకవిధంగా ధర్మపాలనమే! వారిని ఆపిందీ ధర్మభీతే!"

"దానితోనే కాబోలు - ధైర్యం వచ్చి - భీమసేనుల వారు దుశ్శాసనుల వారి రక్తం తాగుతానని - ప్రతిజ్ఞలు చేసారు."

ఇలా నగరం ఆ రాత్రి సమయంలో తర్కవితర్కాలు చేసుకుంటూ ఉంది.

2

అది సభా ప్రాంగణం.

మయసభను చూసి మనసు పాడుచేసుకున్న కొడుకుని శాంతపరచటానికి ధృతరాష్ట్ర మహారాజు అప్పటికప్పుడు నిర్మించిన సభా ప్రాంగణం.

ఆ సభను చూడటానికే ధర్మరాజునీ, అతని తమ్ములనీ తీసుకురమ్మని విదురుడిని పంపించాడు ధృతరాష్ట్రుడు. ఆ సభలోనే పగటి పూట రాచకుటుంబీకులూ, కురుపాండవ పురోహితులూ, గురువులూ, మంత్రులూ, సేనానులూ కూర్చున్న ఆసనాలన్నీ ఆ సమయంలో ఖాళీగా వున్నాయి.

జూదమాడటానికి పాండవులూ కౌరవులూ కూర్చున్న పరుపులు ఆ సభా మధ్యంలో అలాగే వున్నాయి. చందనం కస్తూరీ కర్పూరం వంటి సువాసన ద్రవ్యాల మధ్య అమర్చిన ద్యూతరంగం అలాగే వుంది. వాటి సువాసనలు గాలిని నింపుతూనే వున్నాయి. గంధం

పూలూ వేసి పూజలు చేసిన పాచికలు అలాగే వున్నాయి. ఆ పరుపులలో ఒకటి భీమసేనుడు కోపాన్ని అణుచుకోటానికి చేసిన ప్రయత్నంలో చిరిగిపోయి దాని పీలికలు కిటికీల్లోంచి వీస్తున్న గాలికి కదులుతున్నాయి. ద్రౌపదీదేవి నించి విప్పిన చీరల గుట్ట ఓ పక్కగా అలాగే వుంది.

దేనినీ కదల్చవద్దని దుర్యోధనుడి ఆజ్ఞ.

ఆ సభా రంగానికి వెనకగా ప్రభుసింహాసనం పక్కగా కౌరవ సోదరులూ, ధృతరాష్ట్రుడూ నివసించే యిళ్ళకి వెళ్ళే ద్వారాలు మాత్రం మూసేసి వున్నాయి. శంతనుని కాలంలో ఓడించి, దాసులుగా చేసుకున్న కుటుంబాల వారు ధర్మానికి కట్టుబడే వారనీ, విశ్వాసానికి మారుపేరనీ ప్రసిద్ధి. అలాంటి కుటుంబాల వారిని ఆరోజు శకుని, కర్ణుడూ ఆ సభా ప్రాంగణానికి కావలివారిగా నియమించారు. పాండవులుగాని, పాండవుల పక్షపాతులు గానీ రాచనగరంలో ప్రవేశించి కౌరవుల మీద దొంగదెబ్బ తీయవచ్చుననే భయంతో వారు కావలివారిని మరింత కట్టుదిట్టం చేసారు.

ఆ కావలి వారిలో పెద్దవాడూ, వృద్ధుడూ జాజిలి. కావలి కాసే దాసులకు ధర్మాధర్మ విచారం కలిగినపుడు జాజిలి మాటే ప్రమాణం.

ఆ సమయానికి – కావలివారు వంతులు మారుతున్నారు. జాజిలివంతు తీసుకోవాల్సిన వాడు యింకా రాలేదు. కొత్తగా వచ్చిన వాళ్ళందరూ కాగడాలతో తమ తమ ప్రాంతాలను చుట్టివస్తూ ఒకరికొకరు సంకేత హెచ్చరికలు చేసుకుంటున్నారు.

రావలసిన వానిపేరు, కశోజుడు. అతను నిండు యవ్వనంలో ఉన్నాడు. మద్దిమానుల్లాంటి బలిష్టమయిన తొడలతో, శతృవుల ఈటెలు పదునుపోయి వంగిపోతాయేమోననిపించే రాతి బండల్లాంటి గుండెలూ నిలువెత్తున నడిచివచ్చే నందీశ్వరుడిలా వుంటాడు కశోజుడు. అతని శరీరం శతృవులకు భయం కలిగిస్తే, కావల్సిన వారికి గుండె దిటవుని యిస్తుంది.

కొన్ని తరాల క్రితం ఆ ప్రాంతంలో స్వతంత్రులుగా వున్న నల్లటి బలిష్టమయిన ఆ జాతి కురు వంశీయుల చేతిలో ఓటమి పాలయింది. బాణాలు గల కురువంశీయులు దూరం నుంచే శత్రువుని పడగొట్టగలగటంతో ఆ జాతి వారికి లొంగిపోయింది. రాచభవనాలలో కాలు పెట్టకుండా దానిని కావలి కాయవలసిన దాసులయారు వారు. వారి స్త్రీలు దాసీలయారు. ఆ జాతి వారు నడుస్తూంటే భూమి కంపించేది. గాలికి ఎదురు నడిస్తే, నిస్సహాయంగా కేకలు వేస్తున్నట్లు సవ్వడి చేసేది గాలి.

కశోజుడు ఆ తెగకి చెందినవాడు. ఓడిన వారికి గెలిచిన వారు ఏర్పర్చిన నియమాలే ధర్మంగా రూపుదిద్దుకొన్నాయి. ఆ ధర్మం ప్రకారం ఏర్పడిన హెచ్చుతగ్గుల వర్ణపు వ్యవస్థలో

శూద్రులకు మిగిలిన మూడు వర్ణాలకీ శుశ్రూష చేయటమే విశిష్ట ధర్మం. ఆ ధర్మ పాలనలోనే ఆనాటి రాచరికాల భద్రత. కొత్తగా ఓడిదాసులవుతున్నవారి సంఖ్య క్రమక్రమంగా పెరుగు తోంది. ఈ కట్టకడపటివారు ఎంతటి బలాఢ్యులైనా తమ పై కులాల వారితో తలపడరాదు. బల ప్రదర్శనకు దిగరాదు. విద్యలను నేర్వరాదు. కలిగిన విద్యలను ప్రదర్శించరాదు.

కశోజుడంటే ఆ కావలివారికి ఒకవిధమైన గర్వం. "మనవాడికీ, భీమసేనుల వారికీ మల్లయుద్ధం జరిగితే మనవాడే గెలుస్తాడు. నేర్పిస్తే గదాయుద్ధంలో మనవాడూ సమవుజ్జీ అవుతాడు" అని వాళ్ళలో వాళ్ళు అనుకుంటారు.

అలాంటి కశోజుడు యింకా రాలేదేమిటి?

జాజిలి ఆలోచనలో పడ్డాడు. ఆందోళనపడ్డాడు.

దాదాపు మూడు కాష్ఠల సమయం గడిచింది.

దూరం నుంచి కశోజుడి ఆకారం రాత్రిని చీల్చుకుంటూ రావటం జాజిలి కంటపడింది. దిగ్గుమంటున్న గుండెలతో లేచి ఎదురు వెళ్ళాడు జాజిలి. తడిమి తడిమి చూస్తూంటే-

"నీ మనవడికేమీ కాలేదు తాతా-" అంటున్నాడు కశోజుడు.

"ఎవరితోనయినా పోట్లాడేవా నాయనా?"

కశోజుడి ఉత్సాహం ప్రస్ఫుటంగానే వుంది. అతని కళ్ళు మెరుస్తున్నాయి. ఏదో కొత్త ఆలోచన... ఏదో కొత్త ఆధారం... దొరికినట్లుంది అతని గొంతు.

"తాతా... నీకు చాలా చెప్పాలి. నిన్ను చాలా అడగాలి. ఒక్కమారు కావలికి వెళ్ళి తిరిగి వస్తాను... నా కోసం కూర్చోవా?"

కశోజుడు కావలాకు వెళ్ళాడు. మబ్బులు ఉరుముతున్నట్లుండే అతని గొంతునించి హెచ్చరికలు - బిగ్గరగా వినిపించి - క్రమంగా దూరమై - మరికొంత వ్యవధి తర్వాత మెల్లగా వినిపించి- క్రమంగా దగ్గరయాయి. అంతా భద్రంగానే వుంది- అంటూ వచ్చి కూర్చున్నాడు.

జరిగిన సంగతి చెప్పాడు-

కశోజుడికి రుమ స్నేహితురాలు. ఆమె ధృతరాష్ట్ర పుత్రులలో ఒకరి యింటి దాసీ. దాసీ ధర్మం ప్రకారం ఆమె కుల స్త్రీలలా పైబట్ట ధరించరాదు. ప్రభువుకీ ఆయన మిత్రులకీ యింటికి వచ్చిన అతిథులకీ ఆసవం అందించాలి. వారి కోరికల మేరకు అభినయించాలి. వినోదం కలిగించాలి. ప్రభువులు వేటకి వెళ్ళినా, యుద్ధాలకు వెళ్ళినా వెంట వెళ్ళాలి. గాయపడితే కట్లు కట్టాలి. సపర్యలు చేయాలి. విరామ సమయాల్లో ఉత్సాహం కలిగించాలి. క్షత్రియులు రాజ్యాలు ఏర్పర్చుకున్నాక దాసదాసీలను రకరకాలుగా సమకూర్చుకున్నారు. యుద్ధాలలో ఓడినవారిని తమ ఆస్తులలో భాగం చేసుకున్నారు. అవసరం వచ్చినపుడు

వారిని అమ్ముకున్నారు. దానాలు యిచ్చుకున్నారు. కానుకలుగా యిచ్చిపుచ్చుకున్నారు. అప్పులు తీర్చలేక తమనీ, తమ బిడ్డలనీ పౌరులు అమ్ముకుంటే వారిని కొనుక్కుని దాసులుగా చేసుకున్నారు. హస్తినాపురంలో అసంఖ్యాక దాసదాసీ జనంలో రుమ కూడా ఒక దాసీ.

ఆమె యజమానురాలు సుధీర. ఆమెది మెత్తటి మనసు. కొన్నాళ్ళుగా రుమా కశోజుల స్నేహం ఆమెకు తెలుసు. అలా జత కట్టడం దాసీ ధర్మం ప్రకారం నిషిద్ధం. సుధీర ఒకటి రెండుసార్లు మందలించి ఊరుకొంది. అయితే- ఒక పురుషుని కోసం ప్రత్యేకించి స్త్రీలో కలిగే సంభ్రమం, ఉత్సాహం, చిరులజ్జా రుమలో కనిపించినపుడల్లా సుధీరకి చాలా ముచ్చటగా అనిపించేది. ఆహ్లాదం కలిగేది. కుల స్త్రీ ధర్మం ప్రకారం ఆమెకి ఒక భర్త, అతనితో మాత్రమే జీవించే అవకాశం, సంతానం కనే యోగ్యత సుధీరకి ఉన్నాయి. అయినా ఆమె భర్తతో అలాంటి సంభ్రమాన్ని ఏనాడూ ఎరుగదు. దుర్యోధన మహారాజు ఎటువంటి వాడయినా భార్యాబద్ధుడు. భానుమతీదేవితో అలాంటి సంభ్రమం సుధీరకి అపుడపుడు కనిపిస్తుంది. దానాదీనా సుధీరకి రుమ పట్ల కొంత పక్షపాతం ఉంది. అందువల్ల- రుమని పురుషుల సేవలో ఎక్కువగా నియోగించదు. కొన్నాళ్ళుగా సుధీరని రుమ అభ్యర్థిస్తోంది. ఆమెని దాస్యం నుంచి తప్పించాలిట. కులస్త్రీలలా పైబట్ట వేసుకోవాలని ఉందిట. ఒక పురుషుడితోనే జీవించాలని వుందిట. తండ్రులెవరో తెలియని సంతానాన్ని కని, వారు కూడా దాసదాసీలుగా బ్రతకబోవటం ఆమెకి యిష్టంగా లేదుట. తండ్రి పేరున్న బిడ్డలని కనాలనుందిట. సుధీరాదేవికి రుమ కోరికను మన్నించాలనే వుంది. కాని ధర్మాన్ని ఎలా భగ్నం చేస్తుంది? ఆ సాహసం ఆమెకి లేకపోయింది.

ఆరోజు జరిగిన సంఘటనలో ద్రౌపదీదేవి దాసీల ధర్మాన్ని ఎదిరించింది. పై బట్టను తీయనంది.

దానితో సుధీరాదేవి - రుమని పిలిచింది. "ఈరోజు ధృతరాష్ట్ర ప్రభువులు తమ బిడ్డలపై ద్రౌపదీదేవి వారి ఆగ్రహాన్ని తగ్గించటానికి ఆమెకు వరాలు యిచ్చారు. రెండు వరాలతో ఆమె భర్తలను దాస్యం నుంచి తప్పించుకుంది. క్షత్రియ స్త్రీ మూడవ వరం కోరటం ధర్మంకాదని కోరలేదు. ఆవిడ ధర్మబుద్ధికి మెచ్చి ప్రభువు పాండవులకు వారి రాజ్యం తిరిగి యిచ్చారు. కానుకలుగా అనేకం యిస్తూ దాసదాసీలను ఆమెకి అర్పిస్తున్నారు. రుమా! నిన్ను ద్రౌపదీదేవి వారి అధీనంలో చేరుస్తాను. నువ్వు ఆవిడని ప్రసన్నం చేసుకో! నీ కోరిక విన్నవించుకో! దాసీగా బ్రతకటంలోని కష్టం అనుభవించిన మనిషి తప్పనిసరిగా నీ కోరిక మన్నిస్తుంది-" అని బోధ చేసింది.

అన్నట్లుగా రుమ ద్రౌపదీదేవి పరిచార జనంలో కలిసిపోయింది. వింజామర వీచటంలో ఆమె నేర్పు, బలమూ ఎరిగినవారు అమ్మవారి సేవలో ఆ పనికి నియోగించారు. అయితే -

ద్రౌపదీ దేవి మందిరంలోనే వున్నారు. ఆమె భర్తలూ అందరూ ఆమెని చుట్టి వున్నారు. రోషంతో ఆమె కంపించిపోతోంది. దుఃఖంతో ఆమె కుమిలిపోతోంది. భర్తల బోధలూ బాసలూ ఆమెని శాంతపరచలేకపోతున్నాయి.

సంకేత స్థలానికి అనుకున్న సమయానికి రాలేకపోయింది రుమ. వస్తూనే కశోజుడిని అల్లుకుపోయింది. 'మనకి మంచిరోజులు వస్తున్నాయంది. ఆ తల్లి తప్పకుండా నన్ను దయజూస్తుంది' అంది.

'అయితే అమ్మగారికి వెంటనే మనవి చేసుకో–' అన్నాడు కశోజుడు.

'అదే సమస్య. ఇది తగిన సమయమో కాదో తెలియటంలేదు. ఆ అమ్మ కోపమూ దుఃఖమూ చూస్తుంటే భయం వేస్తోంది. రేపోమాపో వారు ఇంద్రప్రస్థానికి ప్రయాణం అయితే– మన గతి ఏమిటి? తిరిగి కలుస్తామో– లేదో! అంతేకాదు– దుర్యోధనుల వారు ఇంతటితో తగ్గి ఊరుకోరుట. మరేదో ఉపాయం పన్నుతారుట. పాండవ ప్రభువులనూ, ద్రౌపదీ అమ్మవారినీ అధీనం చేసుకుంటారుట. అందరూ అనుకొంటున్నది వింటూంటే – నాకు అంతా అగమ్యగోచరంగా వుంది– ఏం చెయ్యాలో తోచటంలేదు. చెప్పు కశోజా–' అంది రుమ.

అతనికీ ఆలోచన తెమలలేదు.

– రుమని తెల్లవారు జామున సంకేత స్థలంలో కలుసుకోమని చెప్పాను. "నన్నేం చేయమంటావో చెప్పు – తాతా" అని అడిగాడు కశోజుడు.

జాజిలి ఆలోచనలో పడ్డాడు.

దాసుడి బతుకు ఎంత అభద్రతతో కూడి వుందో అతనికి బాగా తెలుసు. రాజుకి ఎదురుగా గాడిదకి వెనకగా నిలబడరాదన్న మాటలో వాస్తవం జాజిలి డబ్బయ్యేళ్ళ జీవితమంతా చూస్తూనే వున్నాడు. సంతోషమయితే మెడలో హారాలను విసిరి సంతోషపరచగల ప్రభువులు కోపం వస్తే ఎదుటివారి మెడల మీద నుండి తలకాయలను తొలగించి వేస్తారు. ఈ విషయంలో ధర్మరాజయినా ఒకటే, దుర్యోధనుడయినా ఒకటే! ఆవేశం బయటపడే దుర్యోధనుడి అంతరంగాన్నయినా కనిపెట్టవచ్చుగాని, ధర్మాన్ని నిలబెట్టటం కోసం శాంతాన్ని ఆధారం చేసుకున్న ధర్మరాజు అంతర్యం ఎవరికీ అంతుపట్టదు.

ఆయన ఎంత ధర్మమూర్తో– ధర్మపాలనలో ఎంతటి కఠోరుడో– ఈనాటి సంఘటన ఒక్కదానితోనే తెలిసిపోతుంది. స్వయంగా భార్య విషయంలోనే ఆయన ధర్మదీక్షలో రవంత మార్పులేదు. అలాంటి భర్త పాలనలో వున్న ద్రౌపదీదేవి రుమ కోరిక మన్నిస్తుందా? అనుమతిస్తుందా? అసలు యివ్వగలదా?

ఎందుకు యివ్వలేదు–?

భర్త చేసిన పనిలో ధర్మాన్నే సవాలు చేసింది. నేను ధర్మ విజితనా అధర్మవిజితనా అని సభని నిలదీసిన ధైర్యవంతురాలు. ఆమె ధర్మ సందేహానికి తలొగ్గి సాక్షాత్తూ భగవంతుడే మానరక్షణ చేసాడు. అలాంటి మహానుభావురాలు రుమ ధర్మసందేహాన్ని పట్టించుకోకుండా వుండదు. రుమ కోరిక ధర్మబద్ధమేనని తేలుస్తుంది–

అయితే యిది సమయమా?

"ఆలోచిస్తూ కూర్చుంటే– అసలు సమయమే లభించకపోవచ్చు కశోజా!"

జాజిలి ఆలోచన తెమిలింది.

"సమయం కోసం చూడటానికిది సమయం కాదు నాయనా! అమ్మవారికి చేతులు జోడించమను. విషయాన్ని నేర్పుగా విన్నవించుకోమను – తప్పక పని సానుకూలమవుతుంది. మీ అభీష్టం నెరవేరుతుంది" అన్నాడు.

3

అది ద్రౌపదీదేవి మందిరం.

ద్రౌపది మంచం మీద వెల్లకిలా పడుకుని వుంది. ఆమె విడివడిన జుత్తు మంచమంతటా పరుచుకున్న నాగుపాము పిల్లల్లా గాలికి కదులుతోంది. ఆ మందిరం వైభాగాన్నీ, దాని చుట్టూ పరుచుకున్న కౌరవుల రాచరికాన్నీ భరించలేక ఎక్కుపెట్టిన వింటి బాణాల్లా ఉన్నాయి ఆమె చూపులు.

అంతవరకూ ఆవిడ భర్తలు అక్కడే వున్నారు.

వారు మాట్లాడుతున్నవన్నీ ఆమె చెవిన పడుతున్నాయి. అవేవీ ఆమెకు జరిగిన అవమానాన్ని, దానివలన కలిగిన దుఃఖాన్నీ కరిగించలేకపోతున్నాయి. శరీరం లజ్జతో కుంచించుకుని పోతూ వుంటే – హృదయం రోషంతో దహించుకుపోతూవుంటే– బుద్ధి ఒకే ఒక ప్రశ్నను పదే పదే వేస్తోంది.

"– నిండు సభలో జరుగుతున్నదానిని పట్టించుకోలేదు గుడ్డి మహారాజు. నేను ధర్మ విజితనా– అధర్మవిజితనా – నేను దాసీనా – అదాసీనా – అని ప్రశ్నిస్తే సభలో ఎవరూ నోరు విప్పలేదు. చిన్నవాడయినా వికర్ణుడు మాత్రం నోరు విప్పాడు. 'జూదం, వేట, తాగుడూ, తిండిపోతుతనమూ అనే నాలుగు వ్యసనాలకు తగులుకున్న మగవాడినీ, అతని చేతలనూ పట్టించుకోరాదు. ధర్మరాజు చేతలో విలువలేదు. అంతేకాదు. అయిదుగురికి చెందిన దానిని ధర్మరాజు ఒక్కడూ పందెం ఒడ్డాడు. అదీ అధర్మమే! కనక ద్రౌపది అధర్మవిజితే' అని వాదించాడు వికర్ణుడు. చిన్నవాడే అలా మాట్లాడటంతో కర్ణుడు మరింత మండిపడ్డాడు. 'పాండవులకన్నా నీకు ఎక్కువ తెలుసా? ఆమె ధర్మవిజిత కాకపోతే వాళ్ళెందుకు ఊరుకుంటారు? అయినా ఒక్కడే భర్తగలది భార్య అవుతుంది. అయిదుగురు

భర్తలు కలది భార్య కాదు - బంధకి. బంధకిని ఏకవస్త్రగా తీసుకురావటమేముంది - విగత వస్త్రను చేసినా అధర్మం కాదని' అన్నాడు కర్ణుడు. దానితో దుర్యోధనుడికి పట్టపగ్గాలు లేకపోయాయి. దుశ్శాసనుడికి యుక్తాయుక్త విచక్షణ నశించిపోయింది - ఆ పరమాత్ముడు తనయందున్నాడు.

విదురుడు తన ధర్మ సందేహాన్ని సభ తీర్చవలసిందే అన్నాడు. ముదుసలి భీష్ముడు- నీ భర్త విప్పలేని ధర్మసూక్ష్మాన్ని నేను విప్పలేనని - తప్పుకున్నాడు. వికర్ణుడు చేసిన ధర్మ నిర్ణయం సరయినదేనన్నాడు విదురుడు. తెలిసి ధర్మ నిర్ణయం చేయకపోతే సభాసదులందరికీ అనృతదోషం అన్నాడు విదురుడు. అయినా దుర్యోధనుడికి జడిసి ఎవరూ నోరు విప్పలేదు.

ఇంత జరిగినా- నిండు సభలో ఏమీ మాట్లాడని ధృతారాష్ట్రుడు- అంతఃపురంలోకి వెళ్ళి - ఎలా మారిపోయాడు? గాంధారీదేవి నగరంలో జరిగిన దుర్నిమిత్తాలను చెప్పిందిట. దానితో మహారాజు 'జడిసాడుట. దానితో తనను పిలిచి తన పుత్రులను పాండవుల కోపాగ్ని నుంచి రక్షించుకోటానికి ప్రయత్నించాడుట.

ఇదంతా జరగటానికి మూలహేతువు ఏది?

తన ప్రశ్న. తన ధర్మ సందేహం. అది సభని కదిలించింది. పరమాత్ముడిని కదిలించింది నగరంలో అపశకునాలు కలిగించింది. ధృతారాష్ట్రుడికి భీతి కలిగించింది.

'నిజంగా ధర్మానికి యింత శక్తి ఉందా! ఆ భీతి వల్లనే ధృతరాష్ట్రుదు రాజ్యాన్నీ, భర్తలనూ తనకి కానుక చేసాడా? అది లేకనే దుష్ట చతుష్టయం తనని అవమానించిందా? ఈ ధర్మమే రేపు రణరంగంలో వారినందరినీ సంహరిస్తుందా? తప్పకుండా సంహరిస్తుంది. ఆ దుర్మార్గుడు దుశ్శాసనుడి గుండెలు చీల్చి ఆ రక్తంతో నా జుత్తు ముడివేస్తానన్నాడు భీమసేనులవారు. ఇందాకటి నుంచి వారు - ఆడదాని కారణంగా పాండవ వీరులకు రాజ్యప్రాప్తా! ఎంత సిగ్గుచేటు! మగవాడన్నవాడు పేరునీ, పెత్తనాన్నీ, సంతానాన్నీ స్వయంగా సంపాదించుకోకపోతే ఎంత చులకన అవుతాడు! పరాక్రమంతో యుద్ధంలో కౌరవులను చంపి రాజ్యం సంపాదించుకోవాలి - అంటూ హుంకరిస్తున్నారు. మిగిలిన సోదరులు కలిసి వస్తే వారు యుద్ధంలో కౌరవులను సంహరించకపోదురా! ఏమో! సర్వమూ ధర్మ పద్ధతిలోనే సాగాలన్న ధర్మరాజులవారే నెగ్గుతారేమో! ధర్మం... ధర్మం... ధర్మానికి అంత బలమున్నదా?-

ధర్మం... ధర్మం... ధర్మం...

ద్రౌపది తనలో తాను అనుకుంటున్న మాటలనే పైకి అంది.

"అమ్మా!"

కళ్ళు విప్పింది ద్రౌపదీదేవి. వింజామర వీస్తున్న దాసి. నిండు యవ్వనంతో అనాచ్ఛాదిత వక్షంతో భయసందేహాల స్వరంతో దైన్యం నిండిన చూపులతో చేతులు జోడించింది.

"తల్లీ! నా పేరు రుమ! ధృతరాష్ట్ర మహారాజు తమకు కానుక చేసిన దాసీని! నాదో ధర్మ సందేహం!"

ధర్మ సందేహం అనగానే ద్రౌపది విశాల నేత్రాల సరస్సులు - సముద్రాలయాయి.

"ఏమిటది-?"

"తమరు రాచవారు. మేము దాసీలం. మీరు పైబట్ట వేసుకోవచ్చు. వివాహం చేసుకోవచ్చు. బిడ్డలని కనవచ్చు. మాకు యివన్నీ నిషిద్ధం. మీరు ఈరోజు దాసీ పద్ధతులను కాదన్నారు. మేమూ మిమ్ము అనుసరించవచ్చా తల్లీ!"

ద్రౌపది చటుక్కున లేచి కూర్చుంది.

"నన్ను పరిహసిస్తున్నావా?!" అంది.

"లేదు తల్లీ - లేదు - ఈ దాసీ దానికి అంత సాహసం లేదు-" అంటూ వజవజా వణికిపోసాగింది రుమ. ఆమె శరీరం మీద భయంతో స్వేదం నిండింది.

ద్రౌపదికి రుమ భయాన్ని చూసి జాలి కలిగింది. క్రమంగా ఆవేశం తగ్గింది. ఆలోచన మొదలయింది.

తనకి కలిగిన సిగ్గు అవమానం - ఈ దాసీదానికీ ఉంటుందా? ఉండటం ధర్మమా? అధర్మమా? ధర్మ సందేహం ఎవరికయినా కలగవచ్చు. దానిని తీర్చటం ధర్మం. తీర్చకపోతే అనృత దోషం కలుగుతుందని విదురుల వారు అన్నారు. తనకు తెలుసా? తెలియదు గదా! లోకంలో ఏ పద్ధతులున్నాయో- తనకు తెలియదా? తెలిసి పాటించక పోవటం అధర్మం కదా! ఆ సిగ్గు అవమానాలను భరించలేకపోవటం హృదయానుసారంగా జరిగింది. బుద్ధి ఎరిగిన ధర్మాన్ని హృదయం నిరాకరించింది. దాన్ని అధర్మమంది. అది అధర్మమేనని ఈనాటి ఘటనలు నిరూపించాయి. అంటే హృదయం చెప్పిందే ధర్మమా? ఇప్పుడీమె అడిగిన దాని గూర్చి నా హృదయం ఏమంటోంది! ఇలాంటి దారుణమైన పద్ధతే ఒకటి లేకపోతే నా పైబట్ట తీసేయటానికి పూనుకునేవారా? ఎవరయినా పూనుకుంటే యింతమంది సభాసదులు ఊరుకునేవారా?

ద్రౌపది పెదాల మీద చిన్ని నవ్వు మొలిచింది. ఆ నవ్వులో ఒక భయం, ఒక పెంకితనం... ఒక సంశయం పెనవేసుకు పోయాయి-

"రుమా! వెళ్ళి - నా భర్తలకు కబురందించు - వారిని వెంటనే యిక్కడకు రమ్మను-"

"చిత్తం" రుమ పరుగుతీసింది.

ఆమె మనసంతా మహోత్సాహంగా ఉంది. మహోన్నతులూ, ధర్మమూర్తులూ పాండవులు ఈ దాస్యాన్ని తొలగిస్తారు. కనీసం కొన్ని పద్ధతులయినా మారుస్తారు - అనుకుంది రుమ.

పాండవులు అయిదుగురూ వచ్చారు.

రుమనీ - యితర దాసీలనూ - బయటకి పంపేసింది ద్రౌపది.

"ధర్మరాజా! నిన్నంతా ధర్మస్వరూపుడంటారు. సకల ధర్మాలూ నీకు తెలుసునంటారు. ఏ ధర్మ సందేహాన్నయినా నీవు తీర్చగలవంటారు. నీ ధర్మ దీక్ష ఎటువంటిదో యీనాడు సభలో నేను కళ్ళారా చూసాను. లోకమంతా చూసింది. నేను ధర్మవిజితనా- అధర్మవిజితినా - అన్న సంశయాన్ని నీవు తీర్చలేకపోయావు. తిరిగి దానిని నేను ప్రశ్నించటం లేదు."

అంటూ ద్రౌపది ఆగింది, భర్తలందరినీ కలయజూసింది.

"ప్రభువులయిన మీరు వేసుకున్న పై బట్టలను దాసులవగానే మీరు తొలగించుకున్నారు. మీరు మగవారు. మీకు అది కష్టంగా తోచలేదు. అవమానంగా తోచలేదు. ఆడదాన్ని గనక నాకు అది భరించరానిదిగా... అవమానంగా... కష్టంగా అనిపించింది. ఈ పద్ధతి - దాసదాసీధర్మం - చాలా దుర్భరంగా అనిపించింది. తతిమా దాసీలకు మాత్రం అలా అనిపించదా? అది అధర్మం కాదా? చెప్పండి! నా సంశయం తీర్చండి-"

ధర్మరాజు ఆలోచనతో భృకుటి ముడిచాడు.

చదివినవీ, పెద్దల ద్వారా విన్నవీ అనేకానేక ధర్మాలు తనకు కంఠోపాఠం. వాటిని స్వపర భేదం లేకుండా పాటించుతాడు. అందుకే- జరగబోయేది మాయద్యూతమని తెలిసీ, ఆ విషయం విదురుల వారు వివరించినా సరేనని- ఎందుకు పాచికలాడాడు! క్షత్రియుడు యుద్ధానికి పిలిచినా, ద్యూతానికి పిలిచినా తిరస్కరించరాదనే ధర్మ జ్ఞానం వల్ల ఆడాడు. ఓడాడు. సమస్తమూ పోగొట్టుకున్నాడు. తనే కాదు - తను పెద్దవాడనీ తన మాట జవదాటరాదనీ - తమ్ములు నలుగురూ తనతో సమంగా ధర్మపాలన చేసారు. ద్రౌపది నిండు సభలో వేసిన ప్రశ్నకు వికర్ణుడు చేసినపాటి ధర్మ నిర్ణయం తను చేయలేకపోయేవాడా? ధర్మం పదునైన కత్తి. ధర్మ దీక్షాపరుడన్న జగద్విఖ్యాతి ఆ కత్తిని బయటకు తీయించలేకపోయింది. తీసివుంటే ఏమి జరిగుండేది? ధర్మం పేరిట జరిగే అధర్మం తన కంటికి కనిపించేది కాదా! కనీసం ధర్మ పద్ధతులలో కొన్నింటిలోనైనా అధర్మం ఉండే అవకాశం ఉందని తనకి అనిపించలేదా?

ధర్మరాజు వయిపు ఒక తృటి పరకాయించి భీమసేనుడు అందుకున్నాడు-

"ద్రౌపదీ- నీ ప్రశ్నకీ ధర్మానికీ సంబంధం లేదు. దాన్ని తెలియజెప్పటానికి అన్నగారి వంటి మేధావి అవసరం లేదు. దాసీలు వేరు. కుల భామలు వేరు. కనక నీ మానావమానాలు వేరు. దాసీలకు నీకు కలిగిన కష్టం కలగదు. అవమానంగా అనిపించదు. అలా కలగటమే అధర్మం. అలాంటి అధర్మానికి ఏదాసీలయినా ఒడిగడితే- దానికి ఎలాంటి శిక్ష ఉచితమో అన్నగారు నిర్ణయిస్తారు. లోకం నడవాలంటే నాలుగు వర్ణాల వారూ వారి విధులు పాటించ వలసిందే! లోకాన్ని నిలబెట్టేది ఆ ధర్మమే! ఆ ధర్మపాలనే! అలా జరగని నాడు అధర్మం

పెచ్చుపెరిగి జగత్ప్రళయం ముంచుకొస్తుంది. నీవీరోజున నిండు సభలో భర్తలను నిలదీయలేదు. వారిని ప్రశ్నించలేదు. సభాసదులను మాత్రం అడిగావు. ఆ ధర్మపాలనే అవమానం నుంచి నిన్ను రక్షించింది. అంతకన్నా ధర్మానికున్న శక్తికి మరే దృష్టాంత మేముంది? అందుకేగదా- అంతవరకూ నోరు మెదపని నేను దుర్యోధన, దుశ్శాసనుల మీద ప్రతిజ్ఞలు చేయగలిగాను! గాంధారీ దేవి భర్తను ఎదిరించింది. ఆ అధర్మం వల్లనే వారి కులం సర్వనాశనం కాబోతోంది-"

అర్జునుడు మెచ్చుకోలుగా అన్నాడు- "అన్నగారు బలశాలులే అనుకున్నాను. బుద్ధి శాలులు కూడా-"

ద్రౌపదికి సంశయం తీరలేదు.

కవలల వైపు చూసింది.

"అన్నల మాటే మాకు శిరోధార్యం దేవీ!" అన్నారు వారు.

దానితో- భీముడు మరింత ఉత్సాహంగా అన్నాడు.

"ద్రౌపదీ- ఇది అంతగా పట్టించుకోవలసినదేం కాదు. అతి సాధారణ ధర్మం. ప్రభువుల మానావమానాలు మాత్రమే లోకానికి మానావమానాలు. దాసులు పరాజితులు. పరాధీనులు. వారు ప్రభువుల మానావమానాలనే తమ మానావమానాలుగా భావించాలి. అందు కోసం ప్రాణాలు బలిపెట్టాలి. ప్రాణాలు తీయాలి. అదే ధర్మం-"

"అయితే- దుర్యోధన దుశ్శాసనులు ఓడిపోయి వారి భార్యలు దాసీలయితే- మీరూ వారి భార్యల బట్టలు తొలగిస్తారా?"

"వారా పని స్వయంగా చేయకపోతే- నేను ఆవశ్యం చేస్తాను-" అన్నాడు భీమసేనుడు దృఢంగా.

క్షణకాలం ఆ స్త్రీ బిత్తరపోయింది.

విచలిత హృదయంతో ధర్మరాజు వయిపు చూసింది.

ధర్మరాజుకి అప్పటికి ఆలోచన తెగింది.

ద్రౌపదిది ధర్మ సందేహమే - చర్చనీయమే- కులభామల కుండే మానావమానాలు దాసీలకు కూడా ఉండవచ్చు. ఉంటే - ఉండనిచ్చితే- దాసీల పనులు ఎవరు చేస్తారు? కుల భామలకు అన్నీ ఎవరు అమరించుతారు? వీరులకు ఎవరు సపర్యలు చేస్తారు? ఎవరు ఉల్లాసపరుస్తారు? అందుకే గదా దాసీలకు సిగ్గు లజ్జలు ఉండరాదు - ఉంచరాదు. అందుకే గదా - వారికి పైబట్ట నిషిద్ధం - అనుకున్నాడు.

కాని-

కథా నిలయం
5891
శ్రీకాకుళం

ఆ ఆలోచనాపరుడికి తన ఆలోచనలో ఏదో అధర్మం అనిపించసాగింది. అదేమిటో లోతుగా ఆలోచించాలనిపించింది. దాన్ని- తేల్చుకుంటే- బయటకు చెప్పాలి. చెపితే అందరూ ఒప్పుకుంటారా? ఒప్పుకోకపోతే తన గౌరవం నిలుస్తుందా? ధర్మ దీక్షకు మారు పేరయిన ధర్మరాజుకి ఆ పేరు దక్కుతుందా? అందరూ ఒప్పుకునే దానిని సమర్థించితేనే గదా - గౌరవ మర్యాదలు! ఒప్పుకుంటారో లేదో తెలీని దాని విషయంలో - ధర్మాత్ములు ఏంచేశారు? మౌనం వహించారు. దాన్నే ధర్మంగా భావించారు.

అనుకుని-

సభలో ద్రౌపది ప్రశ్నకు ఎలా మౌనం వహించాడో- అలాగే ఆ ఏకాంత మందిరంలో ఆ స్త్రీ సంశయానికీ అలాగే మౌనం వహించాడు ఆ ఆలోచనాశీలి.

అన్నగారి మౌనాన్ని అంగీకారంగా ప్రకటించి భీముడు అన్నదమ్ములను బయలుదేర దీశాడు.

"ద్రౌపదీ- మరీ లేనిపోని ఆలోచనలు తగవు. వలదు. విశ్రమించు-" అన్నాడు భీమ సేనుడు ప్రేమాప్యాయతలతో.

అందరూ వెళ్ళిపోయినా ద్రౌపదీదేవి అలాగే కూర్చుండి పోయింది.

రుమ వచ్చి ఎదుట నిలబడి ఆశగా చేతులు జోడించింది.

ద్రౌపది ఆమెని నిలువునా పరిశీలించింది.

సన్నటి నవ్వు ఆమె మనోహరమయిన పెదాలపై వెలిసింది.

ఆ నవ్వులో- ఒక నిశ్చయం తొణికిసలాడింది.

"దాసీ - వింజామర అందుకో- నేను విశ్రమించాలి" అంది.

■

(రచన - జనవరి 2002)